క్లుప్తంగా

సమయపాలన పాటించాలి

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధించేందుకు క్రమశిక్షణతో కూడిన సమయపాలన పాటించాలని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలిపారు. రావిపాడులోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన కళాశాల వార్షికోత్సవంలో కలెక్టర్ శివశంకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. చదువుతోపాటు క్రీడలు, లలిత కళల పట్ల ఆసక్తి కలిగి ఉండాలని తెలిపారు. తన చిన్నతనంలో తాను పొందిన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. విద్య, క్రీడలలో బహుమతులు సాధించిన విద్యార్థులను, ప్రోత్సహిస్తున్న కళాశాల యాజమాన్య ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు రాయల శ్రీనివాసరావు, కె.రామకోటేశ్వరరావు, కపలవాయి రాజేంద్రప్రసాదు, పోటు అచ్యుతరావు, పి.కృష్ణారావు, ప్రిన్సిపల్ ఓగూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పశు విజ్ఞాన బడి కార్యక్రమం

ఈపూరు: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఇనిమెళ్ల గ్రామంలో పశు విజ్ఞాన బడి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏడాదికి ఒక దూడ గురించి రైతులకు వివరించారు. అనంతరం పశుసంవర్ధక శాఖ పల్నాడు జిల్లా అధికారి డాక్టర్ కె.కాంతారావు మాట్లాడుతూ రైతులందరూ ఏడాదికి ఒక దూడను పొందడానికి తీసుకోవల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో ముప్పాళ్ల పశువైద్యాధికారి డాక్టర్ ఎం.సునీత, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ ఆర్.వెంకట రామయ్య, పశువైద్య సిబ్బంది, గ్రామ పశుపోషకులు పాల్గొన్నారు.

ఐఐఎం శిక్షణకు కనపర్రు హెచ్‌ఎం నగేష్

నాదెండ్ల: స్థానిక కనపర్రు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న తుర్లపాటి నగేష్‌కు సమగ్రశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, అహ్మదాబాద్‌లో జరిగే లీడర్‌షిప్ ఎక్సలెన్స్ శిక్షణకు ఎంపికయ్యారు. సర్వశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 6వ తేదీ నుంచి 12వ తేదీ వరకూ శిక్షణ జరగనుంది. ఈ శిక్షణకు రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి 50 మంది హాజరుకానున్నారు. ప్రతి జిల్లాకు ఇద్దరు చొప్పున ఎంపిక కాగా, పల్నాడు జిల్లానుంచి నగేష్‌తో పాటూ పొట్లూరు హెచ్‌ఎం విజయభాస్కర్ ఎంపికయ్యారు.

వైఎస్సార్ బీమా అందజేత

రొంపిచర్ల: మండలంలోని వీరవట్నం గ్రామంలో ఇటీవల మృతి చెందిన లక్కుపోగు ఎలీషా కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం క్రింద మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేల రూపాయలను బుధవారం అందజేశారు. ఈ మొత్తాన్ని మృతుడి భార్య లక్ష్మమ్మకు సర్పంచ్ మానుకొండ వాసుదేవరెడ్డి అందించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తహీనత లేకుండా చూడాలి

నరసరావుపేట: బాలబాలికలలో రక్తహీనత లేకుండా చూడాలని సామాజిక పరివర్తన మార్పు సమాచార వ్యవస్థ జిల్లా సమన్వయ అధికారి (ఎస్‌బీసీసీ) కె.దస్తగిరి సూచించారు. జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశాల మేరకు పట్టణంలోని 24వ సచివాలయం, స్కూల్, అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలబాలికలకు ప్రతినెలా హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. అనంతరం బాలబాలికలతో చేతుల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ టీచర్ పాల్గొన్నారు.

ఫెన్సింగ్ పోటీలకు ఎస్‌ఎస్ అండ్ ఎన్ విద్యార్థి

నరసరావుపేట ఈస్ట్: శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల విద్యార్థి డి.నిఖిలేశ్వర్ రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్య, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ యక్కల మధుసూదనరావు బుధవారం తెలిపారు. బాపట్ల జిల్లా చింతాయపాలెంలో నిర్వహించిన జిల్లా జట్టు ఎంపిక పోటీలలో పాల్గొని పల్నాడుజిల్లా జట్టుకు ఎంపికైనట్లు వివరించారు. కర్నూలులో ఈనెల 27వతేదీ నుంచి 29వతేదీ వరకు జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో నిఖిలేశ్వర్ పల్నాడు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తాడని వివరించారు. నిఖిలేశ్వర్‌ను కళాశాల పాలకవర్గ అధ్యక్ష,కార్యదర్శులు కె.విజయకుమార్, ఎన్.సుబ్బరాయగుప్త, వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ ఎంఎస్ సుధీర్ తదితరులు అభినందించారు.

కనుమలచెరువులో ఆర్డీఓ పర్యటన

బొల్లాపల్లి: రెడ్డి, యానాదుల సంఘాలకు చెందిన భూములను ఆక్రమణకు గురయ్యాయని, సర్వే చేసి తమ భూములు ఇప్పించాలంటూ స్పందనలో ఇచ్చిన ఫిర్యాదుపై కలెక్టర్ ఆదేశానుసారం విచారణ చేపట్టినట్లు గురజాల ఆర్డీవో కె. అద్దెయ్య తెలిపారు. మండలంలోని కనుమలచెరువు సచివాలయం పరిధిలో గాం. దీనగరంకు చెందిన రెడ్డి, యానాదులు, తుపాకుల పులిరాజుతో పాటు మరికొందరు స్పందనలో ఫిర్యాదు చేయడంతో బుధవారం ఆ ప్రాంతంలోని భూములను ఆర్డీవోతో పాటు రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ఈ ప్రాంతంలో రైతులను విచారించారు. 1996లో ఈ ప్రాంతానికి చెందిన భూములు రెడ్డి, యానాదులమైన మాకు పట్టాలు పంపిణీ చేశారని, వీటిని రద్దు చేయకుండానే 2011లో తిరిగి మరొకరికి పట్టాలు ఇచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గురజాల ఆర్డీవో కార్యాలయ ఏవో ఎస్. శివనాగిరెడ్డి, తహసీల్దార్ టి.ప్రవీణ్‌కుమార్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

వినుకొండ(నూజెండ్ల): ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 30న వినుకొండ పర్యటన సందర్భంగా సభాస్థలి, హెలీప్యాడ్ స్థలాలను జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, జిల్లా ఎస్పీ, వై.రవిశంకర్‌రెడ్డిలు స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుతో కలసి గురువారం పరిశీలించారు. పట్టంలోని ఎన్‌ఎస్పీ కాలనీలోని స్థలం, నూజెండ్ల రోడ్డులోని నూతనంగా నిర్మించిన మున్సిపల్ స్టేడియం, వెల్లటూరు రోడ్డులోని స్థలాలను వారు పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వినుకొండలో జగనన్న తోడు పథకం సభ ఏర్పాటు చేయడం గర్వకారణమన్నారు. ముఖ్యమంత్రి సభకు వేలాదిగా అభిమానులు కార్యకర్తలు తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్‌కుమార్, కమిషనరు బి.శ్రీనివాసులు, టౌన్‌ప్లానింగ్ అధికారులు, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే బొల్లాబ్రహ్మనాయుడుతో కలసి స్థలాలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

హక్కుదారుడికి భూ హక్కు-భూ రక్ష

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- వినుకొండలో రీసర్వే పనులు ప్రారంభం

వినుకొండ(నూజెండ్ల): ప్రజల ఆస్తులను సర్వే చేసి, సరిహద్దులను గుర్తించి హక్కుదారుడికి సమగ్ర వివరాలతో కూడిన పత్రాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న శాశ్వత భూ హక్కు - భూరక్ష పథకాన్ని ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. వినుకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పట్టణ రీసర్వే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రారంభించారన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ రీసర్వే కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎప్పుడో బ్రిటీష్ కాలంలో భూముల సర్వే జరిగిందని, ఆ రికార్డులతోనే ఇప్పటి వరకు భూ వ్యవహారాలు నడుపుకుంటూ వస్తున్నామని, దీనివల్ల చాలా మంది నష్టపోతున్నారన్నారు.

అసాధ్యమని గత ప్రభుత్వాలు చేతులెత్తేసినా భూముల రీసర్వేను నేడు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేసి కొత్త చరిత్రను లిఖించారఅన్నారు. గత ప్రభుత్వాల్లో ఏదో ఒక నెంబర్ వేసి రిజిస్ట్రేషన్ చేయించుకుని అమాయక ప్రజల భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నాలు చేశారని, ఇప్పుడు ఆ పరిస్థితి ఉండదన్నారు. ఈ క్రమంలో బలహీన వ్యక్తులు వారి ఆస్తులను సులువుగా రుజువు చేసుకోలేక ఆస్తులను అప్పనంగా ఇచ్చిన సంఘటనలు ఎన్నో చూశామన్నారు. ఇటువంటి సంఘటనలు జరగకుండా రీసర్వేకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. డ్రోన్‌తో సర్వే చేసిన తరువాత క్షేత్రస్థాయిలో సర్వే చేస్తారన్నారు. రిజిస్ట్రేషన్‌లో తారుమారు చేసే అవకాశాలు లేకుండా చేస్తామని, ఈ భూ సర్వే ద్వారా ప్రతి ఒక్కరూ భద్రంగా ఉండొచ్చని అన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.


రీ సర్వే పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

అభివృద్ధిని ఎవరూ అడ్డుకోలేరు

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- ముప్పాళ్లలో ఎమ్మెల్యే పర్యటన

ఈపూరు: ప్రభుత్వ సంక్షేమ పథకాలు పార్టీలకు, కులమతాలకు అతీతంగా అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండలంలోని ముప్పాళ్ల గ్రామంలో రెండో రోజు బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అధికారులు, సచివాలయ సిబ్బందితో కలిసి గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏ మేరకు అమలువుతున్నాయి, ఏ విధంగా అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తుర్లపాటి చౌడయ్య, మండల పార్టీ అధ్యక్షులు కోపెల దేవరాజ్, గ్రామసర్పంచ్ బయ్యవరపు రమ్య రవికుమార్, సొసైటీ అధ్యక్షులు బొల్లా బుజ్జి, గోనుగుంట్ల వెంకట హనుమయ్య, శాకమూరి బుచ్చయ్య, ఎంపీటీసీ సభ్యులు,మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.


సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

అట్రాసిటీ కేసు విచారణ

నాదెండ్ల: ఎస్సీ ఎస్టీ కేసు విచారణకు డీఎస్పీ ఖ్రముద్దీన్ బుధవారం నాదెండ్ల పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. చందవరం గ్రామానికి చెందిన వై.రమణారెడ్డి 2015లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదైన కేసు విచారించారు. ఎస్సై భాస్కర్‌ను, సిబ్బందితో మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు.

వెన్నెల నేత్రాలయానికి జాతీయ గుర్తింపు

వినుకొండ(నూజెండ్ల): రోగులకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన అత్యుత్తమ సేవలు అందిస్తున్నందుకుగాను పట్టణంలోని వెన్నెల నేత్రాలయం హాస్పిటల్‌కు జాతీయస్థాయిలో గుర్తింపు లభించిందని నేత్రాలయం అధినేత, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి తెలిపారు. స్థానిక వెన్నెల నేత్రాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఢిల్లీకి చెందిన నేషనల్ అక్రిడేషన్ బోర్డు ఫర్ హాస్పటల్ అండ్ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ (ఎన్ఏబీహెచ్) సంస్థ ఈ గుర్తింపును ఇచ్చినట్లు వివరించారు. ప్రత్యేక వైద్యవర్గాల అధికారుల బృందం పలు దఫాలుగా హాస్పటల్‌ను తనిఖీ చేయగా రోగులకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నట్లు గుర్తించారన్నారు. జాతీయస్థాయిలో ఈ గుర్తింపు రావడం ద్వారా ప్రధానంగా లబ్ధిపొందేది రోగులని తెలిపారు. వెన్నెల నేత్రాలయం జాతీయస్థాయిలో గుర్తింపు పొందడం పట్ల పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు అభినందనలు తెలియజేశారు.


అవార్డుతో డాక్టర్ దస్తగిరి

పర్యావరణ పరిరక్షణకు పాలిథిన్ కవర్ల నిషేధం

మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని

చిలకలూరిపేట: పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా పాలిథిన్ కవర్ల నిషేధం తప్పదని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో బుధవారం నిర్వహించారు. సమావేశానికి మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని అధ్యక్షత వహించారు. ఎజెండాలో ప్రధాన అంశమైన ప్లాస్టిక్, పాలిథిన్ వస్తువుల నిషేధంపై చర్చ కొనసాగింది. టీడీపీ సభ్యుడు గంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పాలిథిన్ కవర్లు ఉత్పత్తి కాకుండా చూడాలని కోరారు. దీనికి మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు ప్లాస్టిక్ ఉత్పత్తుల విక్రయాలు చేయకుండా నిషేధం విధిస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో వైస్ చైర్మన్లు వలేటి వెంకటేశ్వరరావు, కొలిశెట్టి శ్రీనివాసరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


విద్యార్థి మొహమ్మద్ ఆఫాన్‌ను సన్మానిస్తున్న చైర్మన్, కౌన్సిల్ సభ్యులు

విద్యార్థికి అభినందనలు...

పట్టణానికి చెందిన విద్యార్థి మొహమ్మద్ ఆఫాన్ దక్షిణాఫ్రికాలో జరగనున్న మార్షల్ ఆర్ట్స్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ విద్యార్థికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి విడదల రజిని సూచనల మేరకు కౌన్సిల్‌లో అభినందించి, రూ. 25వేలు ప్రోత్సాహక బహుమతిని చైర్మన్ రఫాని, కౌన్సిల్ సభ్యులు అందించారు.

కౌలు రైతు ఆత్మహత్య

యడ్లపాడు: అప్పుల తీర్చలేమన్న బాధతో మనస్థాపం చెంది పంటచేలో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కారుచోల గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. అంబడపూడి వెంకటరత్తయ్య (30) సొంత భూమి లేకపోవడంతో రైతుల వద్ద కౌలుకు తీసుకుని ప్రత్తి, మిరప పంటల సాగును చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో తనకు తెలిసిన వారి వద్ద నుంచి పుట్టినచోటల్లా అప్పులు తెచ్చి సాగుకు పెట్టుబడి పెట్టాడు. ఈ ఏడాది గుత్తావారి పాలెం పరిధిలో రెండున్నర ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని ఎకరంలో ప్రత్తి పంట, మిగిలిన దాంట్లో మిరప సాగును చేపట్టాడు. గతేడాది పంటలు సక్రమంగా దిగుబడులు రాని కారణంగా అప్పు పడ్డాడు. ఈ ఏడాది కూడా ప్రత్తి దిగుబడి పెట్టుబడికి సరిపోగా, మిరప తెగుళ్ల, వాతావారణం కారణంగా దిగుబడి రాలేదు. దీంతో మంగళవారం ఉదయం 7 గంటల సమయంలో పంటచేలోనే గడ్డిమందును తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమీప రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో అపస్మారక స్థితిలో ఉన్న వెంకటరత్తయ్యను చిలకలూరిపేట ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక వైద్యసేవల అనంతరం గుంటూరు సమగ్ర ఆస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. ఆస్పత్రిలో మృతుని తండ్రి పెదజాను ఇచ్చిన సమాచారం మేరకు యడ్లపాడు ఎస్ఐ పైడి రాంబాబు కేసు నమోదు చేసుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుని కుటుంబ సభ్యులు గత రెండేళ్లుగా పంటనష్టం కారణంగా బయట తీసుకువచ్చిన అప్పులు తీర్చలేక మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. మృతుడికి భార్య రజిని, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.


అంబడపూడి వెంకటరత్తయ్య (ఫైల్)

ప్రజాస్వామ్యానికి పునాది ఓటు హక్కు

వినుకొండ టౌన్: ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు ఓటు హక్కు దోహదపడుతుందని, యువతి యువకులు, ప్రజలు ఓటు హక్కు ప్రాముఖ్యత, వినియోగంపై అవగాహన కలిగిఉండటం ఎంతో అవసరమని ఈఆర్ఓ కందుల శ్రీరాములు పేర్కొన్నారు. 13వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద నుండి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు విద్యార్థులు, అధికారులు, మెప్మా సిబ్బందితో అవగాహనా ర్యాలీ నిర్వహించి, అనంతరం కళాశాల క్రీడా మైదానంలో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.కిరణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాసులు, ఎంఈఓ సయ్యద్ జఫ్రుల్లా, డీటీ తులసి పాల్గొన్నారు.


వినుకొండలో మాట్లాడుతున్న ఈఆర్ఓ శ్రీరాములు

ఓటుహక్కు వజ్రాయుధం

నాదెండ్ల: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో ప్రజల చేతిలో వజ్రాయుధమని, బంగారు భవిష్యత్ నిర్మాణానికి ఓటు హక్కును జాగ్రత్తగా వినియోగించాలని తహసీల్దార్ ఏవీ రమణ చెప్పారు. తహసీల్దార్ కార్యాలయంతో పాటూ పలుచోట్ల జాతీయ ఓటర్ల దినోత్సవం బుధవారం నిర్వహించారు. గణపవరం చుండి రంగ నాయకులు డిగ్రీ కళాశాలలో జరిగిన జాతీయ ఓటర్ల దినోత్సవంలో ప్రిన్సిపల్ ఎం.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ చెన్నుపాటి చైతన్య, హెచ్‌వోడీలు విఠల్‌బాబు, రామకృష్ణ పాల్గొన్నారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం:ప్రజాస్వామ్యానికి పునాది ఓటు హక్కు అని తహసీల్దారు షేక్ జాన్‌సైదులు అన్నారు. బుధవారం 13వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులచే ర్యాలీ కార్యక్రమంతో పాటు ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దారు పి.నాసరయ్య, సీనియర్ సహాయకులు బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె.శ్రీనివాసరావు, వీఆర్వో మల్లెల రాధ, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు ఉన్నారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట:అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సహాయ ఎన్నికల అధికారి, తహసీల్దార్ జి.సుజాత చెప్పారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఎస్‌కేకే ఎస్‌సీవీఎస్ జూనియర్ కళాశాల విద్యార్థులకు బుధవారం ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, రంగోలి, సంభాషణ, క్విజ్ పోటీలు నిర్వహించి మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ కె.సునీత, బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల: మండలంలోని అన్ని పోలింగ్ బూత్‌లలో, తహసీల్దార్ కార్యాలయాలలో 13వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్‌లైన ఓటర్లను నూతనంగా ఓటర్లుగా నమోదైన యువకులు సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ అంకారావు, ఆర్ఐ సుబ్బారావు, వీఆర్వో సుబ్బారెడ్డి, పోలింగ్ బూత్‌ల అధికారులు, సచివాలయ సిబ్బంది, సిబ్బంది పాల్గొన్నారు.

ఈపూరులో...

ఈపూరు: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రమైన ఈపూరులో ఓటుపై అవగాహన ర్యాలీ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయజ్యోతి కుమారి మాట్లాడుతూ అర్హులైన ప్రజలందరూ తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు. ఎక్కువ మంది ఎలక్షన్ పోలింగ్‌లో పాల్గొనేలా ప్రోత్సహించేందుకు భారత ప్రభుత్వం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఓటు హక్కుపైన, ప్రజాస్వామ్య వ్యవస్థపైన ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు కమిషన్ కొన్ని ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ డబ్బుకు, ప్రలోభాలకు లొంగకుండా సమర్థవంతమైన నాయకుడిని ఎన్నుకోవడం ద్వారా పరిపాలన సుభిక్షంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉషాకిరణ్, సర్పంచ్ చెంచయ్య పాల్గొన్నారు.

సోలార్ ఫెన్సింగ్ తగిలి కౌలు రైతు మృతి

వినుకొండ(నూజెండ్ల): పొలానికి సాగునీరు పెట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు సోలార్ పెన్సింగ్ తగిలి కౌలు రైతు మృతి చెందిన సంఘటన నూజెండ్లమండలం కమ్మవారి పాలెం సీమ పొలాల్లో ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద గురువారం జరిగింది. ఐనవోలు పోలీసుల కథనం ప్రకారం దాట్ల వారిపాలెం గ్రామానికి చెందిన మక్కెళ్ల వెంకటేశ్వర్లు(30) తాను సాగు చేస్తున్న పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి మోటారు ఆపి తిరిగి వస్తుండగా సోలార్ పెన్సింగ్ తగిలి మృతి చెందాడు. సమాచారం తెలుకున్న ఐనవోలు పోలీసులుకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నేడు కొండవీడులో ఉచిత వైద్యశిబిరం

నరసరావుపేట: రిపబ్లిక్ డేను పురస్కరించుకుని కొండవీడు ఇఎన్‌టీ వైద్యశాలలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు రెడ్‌క్రాసు సొసైటీ జిల్లా అధ్యక్షుడు, వైద్యశాల అధిపతి డాక్టర్ కె.జగన్ మోహన్‌రెడ్డి వెల్లడించారు. గురువారం హాస్పిటల్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుట్టిన పిల్లలందరికీ మూడు నెలల నుంచి ఆర్నెల్లులోపు వినికిడి పరీక్షలు చేయించుకోవాలన్నారు. సమావేశంలో డాక్టర్లు రామ్మోహన్ రెడ్డి, కృష్ణంనాయుడు, ఆడియాలజిస్టు రవికుమార్, సీఇవో మస్తాన్‌రెడ్డి, మేనేజర్ మహేష్ పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వీడండి

శావల్యాపురం: జాతీయ ఉపాధి హామీ పథకంలో సిబ్బంది విధుల్లో ఆలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్స్ జాబ్ కల్గిన కూలీల అందరికీ పనులు కల్పించాలన్నారు. ఆయనతో పాటు ఏపీవో రాజు టీఏలు శ్రీనివాసగుప్తా, సుబ్బారావులు ఉన్నారు.

ట్రాఫిక్‌పై అవగాహన ఉండాలి

శావల్యాపురం: రోడ్డు ప్రమాదాలు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించినట్లు ఎస్సై గల్లా రవికృష్ణ తెలిపారు. బుధవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాల నియంత్రకు పాటించాల్సిన అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సదస్సులో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాలాది శ్రీనివాసరావు, బెజవాడ ఆంగ్ల బోధకులు బెజవాడ నాగేశ్వరావు, పాల్గొన్నారు.

బహిరంగ క్షమాపణలు చెప్పాలి

నరసరావుపేట: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజుపై పల్నాడు జిల్లా మాజీ అధ్యక్షుడు కర్ణ అమరసైదారావు చేసిన వ్యాఖ్యలను విరమించుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలని నూతన జిల్లా అధ్యక్షుడు ఆలోకం సుధాకర్‌బాబు డిమాండ్ చేశారు. నరసరావుపేటలో శుక్రవారం నూతన జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించేందుకు సోము వీర్రాజు రాకను పురస్కరించుకొని ఏర్పాట్లను పరిశీలించేందుకు గురువారం ఆయన నరసరావుపేటకు వచ్చారు. జిల్లా జనరల్ సెక్రటరీలు ఏలూరి శశికుమార్, కె.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

నవోదయ విద్యార్థికి ప్రథమ బహుమతి

చిలకలూరిపేటటౌన్: 'ముగింపు కారాదు... వైఫల్యం ప్రాణాంతకం కారాదు' అన్న చిత్రలేఖనానికి జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి గెలుచుకున్నారని మండలంలోని మద్దిరాల గ్రామంలోని జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు చెప్పారు. బుధవారం నవోదయ విద్యాలయ ఆవరణలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన ఈ నెల 22వ తేదీ గుంటూరు జిల్లా నల్లపాడులోని కేంద్రియ విద్యాలయంలో పరీక్షా పే చర్చ కార్యక్రమంలో భాగంగా జిల్లాస్థాయిలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారని, ఈ పోటీల్లో తమ విద్యాలయకు చెందిన పదో తరగతి విద్యార్థి కె పవన్ కుమార్ ప్రథమ బహుమతి సాధించారన్నారు.

వేర్వేరు గ్రామాల్లో పంటకోత ప్రయోగాలు

ఈపూరు: మండలంలోని వనికుంట, ముప్పాళ్ల, ఈపూరు గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. వనికుంట గ్రామంలో మండల స్టాటిస్టిక్స్ అధికారి కె.నాగ శ్రీనివాసరావు పర్యవేక్షణలో శామ్యూల్ అనే రైతు పొలంలో పంట కోత ప్రయోగం నిర్వహించగా జేజీఎల్-384 రకం ఎకరాకు సుమారుగా 36 బస్తాల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. మండల వ్యవసాయ విస్తరణ అధికారి బి.అప్పారావు పర్యవేక్షణలో ముప్పాళ్ల, ముప్పాళ్ల గ్రామాల్లో ఎంపిక చేయబడిన వరి పొలాల్లో పంట కోత ప్రయోగం చేపట్టగా ఎకరాకి 35 నుంచి 40 బస్తాల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. పంట కోత ప్రయోగాల వలన రైతులకు ఎంతో మేలు కలుగుతుందని, దిగుబడి అంచనా, పంటల బీమా ఆధారపడి ఉంటుందని ఏఈవో అప్పారావు తెలిపారు. కార్యక్రమాల్లో ఎస్‌బీఐ ఇన్సూరెన్స్ కో ఆర్డినేటర్ సీహెచ్. శ్రీను, వీఏఏలు కె.ఆనంద్‌బాబు, ఆర్. శివగాయత్రి, ఎం. శేషు బాబు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.


వనికుంట గ్రామంలో పంట కోత ప్రయోగం నిర్వహిస్తున్న అధికారులు